మనం
కడప | అన్నమయ్య

## మహాలక్ష్మి అలంకరణతో దుర్గామాత



సిద్ధవటం, అక్టోబర్ 17 మనం న్యూస్ : మండలంలోని సాయి నగర్ గ్రామంలో శ్రీ బద్రావతి భావనారాయణ సీతా రామ లక్ష్మణ ఆలయంలో శనివారం దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా దుర్గామాత భక్తులకు లక్ష్మీదేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చింది ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమర్నాథ్ శర్మ మాట్లాడుతూ దేవి శరన్న వరాత్రుల ఉత్సవాల ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా అక్టోబర్ 11 నుండి మొదలైన శరన్నవరాత్రుల 7వ రోజు భక్తులకు దుర్గామాత అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణతో భక్తు లకు దర్శనమిచ్చిందని అమ్మవారి విగ్రహానికి పంచామృత అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించా మన్నారు. గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు

# రాయచోటి మున్సిపల్ పోరులో తీవ్ర ఉద్రిక్తత

**పంజాబ్ బౌన్సర్ల అరెస్ట్, మారణాయుధాలు స్వాధీనం**

**వైఎస్సార్సీపీ చైర్మన్ అభ్యర్థి కారుపై దాడి, పోలీస్ స్టేషన్ల మార్పుతో హైడ్రామా**





మనం ప్రతినిధి రాజంపేట, అక్టోబర్ 17
అన్నమయ్య జిల్లా రాయచోటి మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం భగ్గుమంది. నామినేషన్ల పర్వంలో తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగడంతో పాటు బయటి ప్రాంతాల వ్యక్తులు రంగప్రవేశం చేయడం కలకలం రేపింది.

**పంజాబ్ బౌన్సర్ల అరెస్ట్ – తుపాకులు స్వాధీనం**

ఎన్నికల నేపథ్యంలో రాయచోటిలో పోలీసులు చేపట్టిన ముమ్మర తనిఖీల్లో పంజాబ్ రాష్ట్రానికి చెందిన పదిమంది బౌన్సర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి లైసెన్స్ లేని రివాల్వర్లు, బుల్లెట్లను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

**రెండో రోజు 40 నామినేషన్లు దాఖలు**

మరోవైపు నామినేషన్ల ప్రక్రియ శనివారం రెండో రోజు కూడా కొనసాగింది. మొత్తం 40 నామినేషన్లు దాఖలైనట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. వీటిలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నుంచి 36, బీజేపీ నుంచి 3, జనసేన పార్టీ నుంచి ఒక నామినేషన్ దాఖలయ్యాయి.

**వైఎస్సార్సీపీ చైర్మన్ అభ్యర్థి కారుపై దాడి**

నామినేషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్న వైఎస్సార్సీపీ చైర్మన్ అభ్యర్థి జిన్నా షరీఫ్ లక్ష్యంగా దాడి జరిగింది. రాయ చోటిలోని మదనపల్లి రోడ్డులోని మానస హోటల్ సమీపంలో టీడీపీ వర్గీయులు ఆయన కారును వెంబడించి దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి.

**పోలీస్ స్టేషన్ల మార్పుతో హైడ్రామా**

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు రంగంలోకి దిగి, జిన్నా షరీఫ్‌ను అక్కడి నుంచి సురక్షితంగా తప్పించి తొలుత సంబేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే అక్కడికి కూడా ప్రత్యర్థి వర్గీయులు చేరుకుని దాడికి యత్నించడంతో, పరిస్థితిని గమనించిన పోలీసులు ఆయనను కలకడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం భద్రతా కారణాల దృష్ట్యా డీఎస్పీ స్వయంగా ఆయన్ను గుర్రంకొండ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ పరిణామాలతో రాయచోటి పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.



# నామినేషన్ కేంద్రాల వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి- డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లతో కలిసి ప్రెస్ మీట్**



కడప అక్టోబర్ 17 మనం న్యూస్ : స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ గుంపులుగా వచ్చే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు పూర్తి భద్రత కల్పిస్తామని తెలిపారు.
శనివారం పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడారు. పట్టణ స్థానిక సంస్థల పరిధిలో నామినేషన్ల స్వీకరణ సందర్భంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద ఆంక్షలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్దకు పెద్ద సంఖ్యలో గుంపులుగా రావడం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం అనుమ తించబోమని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాలకు నిర్ణీత సంఖ్యలో మాత్రమే వెళ్లాలని, కేంద్రాల పరిసరాల్లో 500 మీటర్ల పరిధికి సంబంధించి అమల్లో ఉన్న ఆంక్షలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. శనివారం కొన్ని ప్రాంతాల్లో ఆంక్షలను ఉల్లంఘిస్తూ పెద్ద సంఖ్యలో వ్యక్తులు ఒకేసారి నామినేషన్లు దాఖలు చేసేం దుకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులపై దాడి జరిగినప్పటికీ, పోలీసులు అప్రమత్తంగా వ్యవహ రించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారని వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలుకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉందని, అభ్యర్థులు ఆందోళన చెంద కుండా నిర్ణీత సమయంలో తమ నామినేషన్లు సమర్పించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎక్కువ మంది అభ్యర్థులు ఒకేసారి వచ్చే పరిస్థితి ఉంటే ముందుగా పోలీసులకు సమాచారం అందించాలని, తద్వారా తగిన భద్రతా ఏర్పాట్లు చేసి నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల నిర్వహణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారెవరినీ ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
పులివెందుల మున్సిపాలిటీలో ఇప్పటికే 28 వార్డులకు నామినేషన్లు దాఖలయ్యాయని, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి ఒక నామినేషన్ వచ్చినట్లు తెలిపారు. శనివారం కూడా సుమారు 40 నామినేషన్లు దాఖలైనట్లు వివరించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశం కల్పించడమే లక్ష్యమని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా కలెక్టర్, డీఐజీ, ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# కడపలో ఉద్రిక్తత

**కారుకు నిప్పు పెట్టిన దుండగులు**

**గాంధీనగర్ సమీపంలో ఘటన**

**రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు**



మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 17
కడప నగరంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీనగర్ పాఠశాల సమీపంలో పార్క్ చేసి ఉన్న ఓ కారుకు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళ నిప్పు పెట్టడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది.
శనివారం మధ్యాహ్నం వైసీపీ,టీడీపీ శ్రేణుల మధ్య చెలరేగిన ఘర్షణలో సదరు కారుపై రాళ్లతో దాడి చేయగా వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటన మరువకముందే, రాత్రి సమయంలో అదే కారుకు గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీప ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటన వెనుక ఉన్న కారణాలు, నిప్పు పెట్టిన వారి వివరాలపై పోలీసులు ఆరా తీస్తూ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

**ఎక్సైజ్ సీఐ రాజశేఖర్**



సిద్దవటం, అక్టోబర్ 17 మనం న్యూస్ : రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో అక్రమ మద్యం, మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. మండల కేంద్రమైన సిద్ధవటం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ లో శనివారం ఆయన మాట్లాడుతూ కడప ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు ఆదేశాల మేరకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్సైజ్ పరిధిలోని అట్లూరు, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల్లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమ మద్యం, నాటు సారా, మాదకద్రవ్యాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నారాయణ స్థానిక సిబ్బంది పాల్గొన్నారు



## కేరళం ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపునకు చిట్వేలీ ఎన్సీసీ విద్యార్థులు ఎంపిక

చిట్వేలీ అక్టోబర్ 17 మనం న్యూస్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్వేలి ఎన్సిసి ట్రూప్ విద్యార్థులు చెంజి అక్షయ, గోర్ల వైష్ణవి, ఆవుల రమ్య కేరళం రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపునకు ఎంపికవడం పట్ల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు దుర్గరాజు, ఎన్సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్సిసి ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు కేరళం రాష్ట్రంలోని ఇడుక్కి జిల్లా కులమావు ప్రాంతంలో ఈ ట్రెక్కింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాతీయ స్థాయి ట్రెక్కింగ్ శిబిరంలో కేరళ, లక్షద్వీప్, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ తదితర ప్రాంతాలకు చెందిన ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ క్యాంపు ద్వారా విద్యార్థుల్లో సాహసోపేతమైన ఆలోచనలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, జాతీయ సమైక్యతా భావం పెంపొందుతాయని వారు పేర్కొన్నారు. జాతీయ స్థాయి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

## పొలం నుంచి ఇంటికి పయనమైన రైతుకు ప్రమాదం!

### ఆటో ఢీకొని .. తలకు, కాలికి తీవ్ర గాయాలు



ముద్దనూరు, అక్టోబర్ 17,మనం న్యూస్ : రోజంతా పొలంలో కష్టపడి వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి తిరుగు ప్రయాణమైన రైతుకు రోడ్డు ప్రమాదం రూపంలో అనుకోని ఆపద ఎదురైంది. ఆటో ఢీకొట్టడంతో రైతు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలో యామవరం గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గ్రామానికి చెందిన వెంకటరమణ వ్యవసాయ పనులు ముగించుకుని కాలినడకన ఇంటికి వెళ్తుండగా, ముద్దనూరు వైపు నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తు ఢీకొట్టగా తలకు కాలికి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు ముద్దనూరు పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాల తరలించి అక్కడ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కొరకు పొద్దుటూరుకు తరలించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



సిద్దవటం, అక్టోబర్ 17 మనంన్యూస్ : స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిద్దవటం మండల ప్రత్యేక అధికారి, రిటర్నింగ్ అధికారి ఎన్.ఎన్. కృష్ణయ్య అధికారులకు సూచించారు. సిద్దవటం ఎంపీడీఓ సభా భవనంలో శనివారం ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి యాక్షన్ ప్లాన్‌పై సమీక్షించారు. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. మండల పరిధిలో మూడు జోన్లు, నాలుగు రూట్లుగా విభజించి చేపట్టాల్సిన చర్యలను సమీక్షించారు. పొన్నవోలు నుంచి జంగాలపల్లి వరకు జోన్-1, రూట్-1గా, లింగంపల్లి నుంచి మూలపల్లి వరకు జోన్-2, రూట్-2గా, బొగ్గిడివారిపల్లి, నేకనాపురం, పెద్దపల్లి, కనుములోపల్లి ప్రాంతాలను జోన్-3, రూట్-3గా, మాధవరం-1, ఉప్పరపల్లి, శాఖరాజుపల్లి, మాధవరం పరిధిలోని 1, 2, 3 వార్డులను రూట్-4గా గుర్తించి ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లు, నామినేషన్ల స్వీకరణకు అవసరమైన సిబ్బంది, పోలింగ్ రోజున విధులు నిర్వహించాల్సిన సిబ్బంది సంఖ్య, మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఫణి రాజకుమారి, తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మెహెతాబ్ యాస్మిన్, ఎంపీడీవో కార్యాలయ ఏఓ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రిదేవి అలంకారంలో వాసవి మాత



ఒంటిమిట్ట అక్టోబర్ 17(మనం న్యూస్)ఒంటిమిట్ట అమ్మవారిశాలలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి అందులో భాగంగా 7 వ రోజు శనివారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. రాత్రి 9 గంటలకు మంత్రపుష్పం, దశ మంగళ హారతులతో మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# పులివెందులలో ఇకపై రౌడీయిజం చెల్లదు

### ఎంపీ అవినాష్‌రెడ్డిపై బీటెక్ రవి ధ్వజం - కూటమి అభ్యర్థుల నామినేషన్ల వేళ దాడులు హేయం

### హింసను ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: టీడీపీ నేతల డిమాండ్




మనం ప్రతినిధి, కడప అక్టోబర్ 17: పులివెందులలో ప్రతిపక్షాలకు నామినేషన్లు వేసే హక్కు లేదా అని, ఇక్కడ ఇకపై 'రాజారెడ్డి రాజ్యాంగం' నడవదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతలు, దాడులపై స్పందించిన ఆయన, స్థానిక ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మతో పాటు ఆ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినప్పుడు తాము ఎలాంటి ఆటంకాలు సృష్టించలేదని బీటెక్ రవి గుర్తుచేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా కూటమి అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వస్తే అభ్యంతరాలు ఎందుకు వ్యక్తం చేస్తున్నారని ఎంపీ అవినాష్‌రెడ్డిని నిలదీశారు. పట్టణంలో సెక్షన్ 163 బీఎన్ఎస్ (పాత 144 సెక్షన్) అమల్లో ఉన్నప్పటికీ, నిబంధనలను తుంగలో తొక్కి గుంపులుగా రోడ్లపైకి వచ్చి పోలీసులపై దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఆత్మరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చిందన్నారు. కూటమి వాహనాలపై దాడులు చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై, పులివెందులతో సంబంధం లేకుండా బయటి నుంచి వచ్చి గొడవలు సృష్టిస్తున్న వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

### టీడీపీని అంతం చేయాలనే పన్నాగం: పేర్ల పార్థసారథి రెడ్డి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ, నామినేషన్ ప్రక్రియను అడ్డుకునేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు రాళ్లు, కర్రలు, బీరు సీసాలతో దాడికి తెగబడ్డాయని మండిపడ్డారు. టీడీపీ నేతలను అంతం చేయాలనే లక్ష్యంతోనే వేల మందిని తరలించారని ఆరోపించారు. పోలీసులు దాదాపు రెండు గంటల పాటు వీరోచితంగా పోరాడి పరిస్థితిని అదుపులోకి తేవడంతోనే పెను ప్రమాదం తప్పిందని, దాడులకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# రణరంగంగా మారిన పులివెందుల నామినేషన్ల వేళ భగ్గుమన్న ఉద్రిక్తతలు!

### టియర్ గ్యాస్ ప్రయోగం, గాల్లోకి 20 రౌండ్ల కాల్పులు - పోలీసులపైకి రాళ్లు, బాటిళ్లు.. చెల్లాచెదురైన జనం

### డీఎస్పీ సహా పలువురు పోలీసులకు, వైసీపీ నేతలకు గాయాలు- రంగంలోకి ఎస్పీ.. అదనపు బలగాలతో బందోబస్తు కట్టుదిట్టం






మనం ప్రతినిధి కడప అక్టోబర్ 17: పులివెందుల మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజే తీవ్ర హింసాత్మకంగా మారింది. అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ శ్రేణుల మధ్య మొదలైన వాగ్వాదం రాళ్లదాడి, తోపులాటలతో రణరంగాన్ని తలపించింది. పరిస్థితి విషమించడంతో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జి, టియర్ గ్యాస్ ప్రయోగించడంతో పాటు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది.

**టైమింగ్ వివాదం.. భగ్గుమన్న ఘర్షణ**

శనివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ అభ్యర్థులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అప్పటికే టీడీపీ శ్రేణుల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండటంతో, వారి ప్రక్రియ పూర్తయ్యాక లేదా మరుసటి రోజు ఉదయం రావాలని పోలీసులు సూచించారు. అయితే, ముందస్తుగా కేటాయించిన సమయం మేరకే తాము నామినేషన్ వేస్తామని వైసీపీ వర్గాలు ముందుకు తోసుకురావడంతో ఉద్రిక్తత మొదలైంది. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని పోలీసులు వారించినా ఫలితం లేకపోయింది.

**రాళ్లవర్షం.. గాల్లోకి 20 రౌండ్ల కాల్పులు**

?తోపులాట తీవ్రమై పోలీసులపైకి రాళ్లు, గాజు సీసాలు దూసుకురావడంతో పోలీసులు తొలుత లాఠీఛార్జి చేశారు. ఆందోళనకారులు వెనక్కి తగ్గకపోవడంతో దాదాపు 30 టియర్ గ్యాస్ గుళికలు ప్రయోగించారు. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో సుమారు 20 రౌండ్లు గాల్లోకి కాల్పులు జరపడంతో నామినేషన్ కేంద్రం వద్ద తీవ్ర భయాందోళనలు చెలరేగాయి.

**ఎదురెదురు పడకుండా వ్యూహాత్మక నిలువరింపు**

మరోవైపు టీడీపీ శ్రేణులు కూడా రాళ్లు, కర్రలతో సిద్ధమైనట్లు సమాచారం అందడంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఇరువర్గాలు ఎదురుపడితే భారీ ప్రాణనష్టం జరుగుతుందని గ్రహించి, రెండు వర్గాలను సుమారు 200 మీటర్ల దూరంలోనే నిలువరించారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

**నేతలు, పోలీసులకు గాయాలు.. వాహనాలు ధ్వంసం**

ఈ ఘర్షణల్లో పులివెందుల డీఎస్పీ బి. మురళీ నాయక్, పట్టణ సీఐ ఆర్. పురుషోత్తం రాజు సహా పలువురు పోలీసు సిబ్బందికి గాయాలయ్యాయి. పోలీసు చర్యలో మాజీ మున్సిపల్ చైర్మన్ హఫీజ్ చేతికి తీవ్ర గాయమైంది. పలువురు కార్యకర్తలు గాయపడగా స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాలకు చెందిన పలు కార్లు, వాహనాలు ధ్వంసమయ్యాయి.

**రంగంలోకి దిగిన ఎస్పీ.. అదుపులోకి పరిస్థితి**

పరిస్థితి తీవ్రత దృష్ట్యా జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రత్యేక బెటాలియన్ బలగాలతో స్వయంగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిరసనకారులను చెదరగొట్టి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఎంపీ అవినాష్‌రెడ్డితో పాటు టీడీపీ నేతలతో మాట్లాడి అక్కడి నుంచి పంపించివేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఎన్నికల ప్రక్రియ మొదట్లోనే ఇలాంటి తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం స్థానికంగా కలకలం రేపుతోంది

# "సేవ - సురక్ష - సంస్కార్"

### బజరంగ్ దళ్ - సాప్తాహిక్ మిలన్ ఆహ్వానం

### ప్రతి ఒక్కరూ ఆహ్వానితులే విశ్వ హిందూపరిషత్

పుల్లంపేట అక్టోబర్ 17 (మనం న్యూస్)ప్రియమైన ధర్మ రక్షకులకు, హిందూ బంధువులకు నమస్కారం!మన హిందూ ధర్మాన్ని రక్షించుకోవడానికి, యువతలో దేశభక్తిని మరియు ఐక్యతను పెంపొందించడానికి, విశ్వ హిందూ పరిషత్ - బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం "సాప్తాహిక్ మిలన్" కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ ఆధ్యాత్మిక,ధార్మిక మరియు శక్తివంతమైన కార్యక్రమానికి హిందూ సోదరులు మరియు కార్యకర్తలు అందరూ తప్పక పాల్గొనవలసిందిగా కోరుచున్నామన్నారుకార్యక్రమ వివరాలు: తేదీ: 17-10-2026 వారం: శనివారం సమయం: సాయంత్రం 05:00 గంటల నుండి 06:00 వరకు వేదిక: శ్రీ శాంతినికేతన్ హై స్కూల్ పుల్లంపేట గ్రామం బి మండలం అన్నమయ్య జిల్లా.:రేపటి రోజున పుల్లంపేట ఖండ నందు జరగనున్న ధర్మ ప్రసార సమావేశ అనంతరం పైన సూచించిన




పాఠశాల నందు బజరంగ్ దళ్ సాప్తాహిక్ మిలన్ కార్యక్రమం జరుగును .ముఖ్య కార్యక్రమాలు: ఓంకారం (మూడు సార్లు) ఏకాత్మత మంత్రంవిజయ మహా మంత్రం (శ్రీరామ జయ రామ) 13 సార్లు పలకాలి సామూహిక హనుమాన్ చాలీసా పఠనం దేశ భక్తి గీత్ శారీరక మరియు మానసిక వికాస కార్యక్రమాలు ధార్మిక అంశాలు సంఘటిత (భజరంగ్ దళ్) ప్రార్థన శాంతి మంత్రం జయ ఘోషలు"ధర్మో రక్షతి రక్షితః" - మనం ధర్మాన్ని రక్షిస్తే, ఆ ధర్మం మనల్ని రక్షిస్తుంది.ధర్మ రక్షణ కోసం జరిగే ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవ్వండి. మీతో పాటు మరో ఇద్దరు దేశ,ధర్మ ప్రేమికులను తీసుకురండి! అన్నమయ్య జిల్లా కార్యదర్శి శ్రీ వై యన్ జయసింహ ప్రసాద్ గారి ముఖ్య సూచన దుర్గాష్టమి సందర్భంగా శ్యస్త్ర పూజ మరియు హిత చింతక్ చేయుట గురించి సమావేశం ఉంటుందని తెలియజేశారు కావున బాధ్యత కలిగిన కార్యకర్తలు అందరూ తప్పక పాల్గొనవలసిందిగా కోరుచున్నాము. అని విశ్వహిందూ పరిషత్ వారు కోరారు.

# నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత..

## జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ - పులివెందుల ఘటనలో పరిస్థితిని అదుపులోకి తెచ్చాం

పులివెందుల, అక్టోబర్ 17(మనం న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామని, నామినేషన్ కేంద్రాల వద్ద నిబంధనలు ఉల్లంఘించి గుంపులుగా వచ్చే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం పులివెందుల ఆర్డీఓ కార్యాలయంలో.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, డీఐజీ కోయ ప్రవీణ్ తో కలిసి ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు. నామినేషన్ల రెండో రోజు శుభదినం కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చారని ఎస్పీ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో రద్దీ ఏర్పడినప్పటికీ, ఒకటి రెండు ఘటనలు మినహా జిల్లాలోని చాలా ప్రాంతాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని పేర్కొన్నారు. కడప జిల్లాలో శుక్రవారం నుంచే భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద ఆంక్షలు అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ శనివారం కూడా ఆదేశాలు జారీ చేశారని, ఈ నిబంధనలపై అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు ముందుగానే సమాచారం అందించామని వివరించారు. ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా కూడా నిబంధనలను తెలియజేశామని చెప్పారు. ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పించడంతో పాటు




శాంతిభద్రతలను కాపాడటమే పోలీసు శాఖ లక్ష్యమని తెలిపారు. నామినేషన్ కేంద్రాలకు అభ్యర్థులు తమ వెంట పరిమిత సంఖ్యలో వ్యక్తులను మాత్రమే తీసుకురావాలని, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల పరిధిలో నిర్ణయించిన వాహన పరిమితులను పాటించాలని సూచించారు. గుంపులుగా చేరడం, ఊరేగింపులుగా రావడం నిబంధనలకు విరుద్ధమని, ఆంక్షలను తప్పనిసరిగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. పులివెందులలో సుమారు 500 మంది ఒకేచోట చేరి నామినేషన్ కేంద్రానికి వెళ్లేందుకు ప్రయత్నించారని ఎస్పీ తెలిపారు. వారిని గుంపులుగా వెళ్లవద్దని, అభ్యర్థులు మాత్రమే నిబంధనల ప్రకారం రావాలని పోలీసులు పలుమార్లు హెచ్చరించి, నచ్చజెప్పారని వివరించారు. అయినప్పటికీ కొందరు పోలీసులపై రాళ్లు రువ్వడంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగం చేపట్టామని తెలిపారు. రాళ్లదాడి కొనసాగడంతో కొన్ని రౌండ్లు గాలిలో కాల్పులు జరిపినట్లు వెల్లడించారు. అవసరమైన మేరకే బలప్రయోగం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఆదివారం కూడా సెక్షన్ 163 కింద ఆంక్షలు అమల్లో ఉంటాయని, నామినేషన్ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో గుమిగూడడం, ఊరేగింపులుగా రావడం అనుమతించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో స్వతంత్ర అభ్యర్థులతో పాటు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులందరికీ నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు పోలీసు శాఖ సహకరిస్తుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నెల 22వ తేదీలోగా స్మార్ట్ కిచన్ల పనులు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశం

కడప, అక్టోబర్ 17 మనం న్యూస్

జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించేందుకు చేపట్టిన స్మార్ట్ కిచెన్ల విస్తరణకు సంబంధించి పెండింగ్‌బి పనులన్నింటినీ ఈ నెల 22వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో పాటు ఆయా మండలాల ఎంఈవోలతో వీసీ ద్వారా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షించారు.

ఈ సమీక్ష సమావేశంలో స్మార్ట్ కిచెన్ల నిర్వహణ, పాఠశాలల అనుసంధానం, ఆహార సరఫరా మార్గాలు, మౌలిక సదుపాయాలు, ఇతర పెండింగ్ పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రతి విద్యార్థికి నిర్ణీత సమయానికి వేడివేడి ఆహారం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ నెల 22వ తేదీ లోపు జిల్లా వ్యాప్తంగా 38 స్మార్ట్ కిచెన్ల ద్వారా లక్ష మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు.

జిల్లాలో ఇంకా స్మార్ట్ కిచెన్ల పరిధిలోకి తీసుకురావాల్సిన 369 పాఠశాలలకు అనుసంధాన ప్రక్రియ, రవాణా మార్గాల గుర్తింపును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆహార సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్న పాఠశాలలకు సంబంధించి రవాణా సమయాలను పునఃపరిశీలించి, సరఫరా సజావుగా



జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు.

స్మార్ట్ కిచెన్లలో వాహనాల స్టాండింగ్ షెడ్లు, వాహనాల నిలుపుదల వేదికలు, రక్షణ కంచెల నిర్మాణం వంటి పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు, శుద్ధి చేసిన తాగునీటి వ్యవస్థలు, బోరు బావులు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వంటశాలల్లో ఏర్పాటు చేసిన బయో వ్యర్థాల శుద్ధి పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. వంటశాలలకు అవసరమైన కూరగాయలు, ఇతర వంట సరుకులను ముందస్తు ప్రణాళికతో సేకరించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమీప కొనుగోలు కేంద్రాలను గుర్తించాలని సూచించారు. విద్యార్థుల నమోదు సంఖ్య తక్కువగా ఉన్న 13 ప్రాధాన్య ప్రాంతాల్లో వంటశాలల అవసరాలకు అనుగుణంగా కూరగాయల తోటలను ఏర్పాటు చేయాలన్నారు. మండలాల వారీగా ఖాళీలను పరిశీలించి అర్హులైన పాఠశాల వంట సహాయకులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విబిజీ రామ్ జీ, ఉద్యాన శాఖ, ఏపీఎంఐపి శాఖల సమన్వయంతో.. ఆయా పాఠశాలల పరిధిలో న్యూట్రీ కిచెన్ గార్డెన్స్ ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేపట్టాలన్నారు.

జిల్లాలోని మొత్తం 38 స్మార్ట్ కిచెన్లలో ఆహార నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, పరిసరాల శుభ్రత విషయంలో రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, నిర్దేశించిన గడువులోగా అన్ని పనులు పూర్తి చేసి విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో శంశుద్దీన్, ఎస్-ఎస్ఏ ఏపిసి అనురాధ, స్మార్ట్ కిచెన్ల నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఈ మద్దన్న, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసులు, ఏపీ సీఎన్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, పౌర సరఫరాలు, రవాణా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంలు వద్దు, బ్యాలెట్ పేపర్లే కావాలి

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి: డీఎంకే కీలక తీర్మానాలు**

**ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను రద్దు చేయాలని తీర్మానం**

**ఎన్నికల అవకతవకలపై రాష్ట్రపతికి ఫిర్యాదుకు నిర్ణయం**

**కాంగ్రెస్, టీవీకే పార్టీలది ద్వంద్వ వైఖరి అంటూ డీఎంకే విమర్శలు**

డీఎంకే పార్టీ కేంద్ర ఎన్నికల సంఘంపై, ఎన్నికల ప్రక్రియపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) స్థానంలో తిరిగి బ్యాలెట్ పేపర్ల విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆ పార్టీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ా×=) కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కూడా పట్టుబట్టారు. ఈరోజు ఉదయం 11 గంటలకు చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో డీఎంకే అధినేత,



తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన పార్టీ పార్లమెంటరీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం నాలుగు కీలక తీర్మానాలను ఆమోదించారు. వీటిలో ప్రధానంగా ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. ఆమోదించిన తీర్మానాల్లో మొదటిది.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తొలగింపు గురించే ఉంది. ఎన్నికల నిర్వహణలో ఆయన వైఫల్యం చెందారని ఆరోపిస్తూ ఈ డిమాండ్ చేశారు. అయితే, ఏ కారణాలతో ఆయన్ను తొలగించాలని కోరుతున్నారో లేదా ఎలాంటి నిర్దిష్ట అవకతవకలు జరిగాయో పార్టీ విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంగా పేర్కొనలేదు. ఈ అంశాలపై రాష్ట్రపతికి సమర్పించే వినతిపత్రంలో పూర్తి వివరాలు పొందుపరచనున్నట్లు తెలుస్తోంది.

రెండో తీర్మానంలో.. విద్యార్థి సంఘాలు నిర్వహిస్తున్న నిరసనలకు డీఎంకే తన మద్దతు ప్రకటించింది. అయితే, ఏ విద్యార్థి సంఘాలు, ఏ డిమాండ్లతో ఆందోళనలు చేస్తున్నాయో ఆ తీర్మానంలో వెల్లడించలేదు. ఇక మూడో తీర్మానంలో.. కాంగ్రెస్, అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీల ద్వంద్వ వైఖరిని డీఎంకే ఖండించింది. ఏయే అంశాల్లో ఈ పార్టీలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయో కూడా ప్రకటనలో వివరించలేదు. నాలుగో తీర్మానం ద్వారా తమ డిమాండ్లను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లి, ఎన్నికల ప్రక్రియలో సంస్కరణలు తీసుకురావాలని కోరాలని పునరుద్ఘాటించారు. ఈ నిర్ణయాలతో డీఎంకే ఎన్నికల సంఘంపై ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది.

# రాజంపేట మున్సిపల్ పోరు రెండో రోజు నామినేషన్ల జోరు!

## 44 వార్డు నామినేషన్లు.. చైర్‌పర్సన్ బరిలో 3 దరఖాస్తులు

### ప్రశాంతంగా సాగిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 17

రాజంపేట పురపాలక సంఘ సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా నామినేషన్ల పర్వం ఊపందుకుంది. శనివారం రెండో రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ అత్యంత ప్రశాంత వాతావరణంలో, ఉత్సాహంగా సాగింది. వివిధ వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులుగా మొత్తం 44 నామినేషన్ పత్రాలు దాఖలు కాగా, అత్యంత కీలకమైన పురపాలక సంఘ చైర్‌పర్సన్ పదవికి మొత్తం 3 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలకు కట్టుబడి అధికారులు నామినేషన్లను స్వీకరించారు. రెండో రోజు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు తమ మద్దతుదారులతో కలిసి వచ్చి ఎన్నికల అధికారులకు దరఖాస్తులు సమర్పించడంతో కార్యాలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఎన్నికల ప్రక్రియ అంతటా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (కోడ్) ఖచ్చితంగా పాటించాలని, ఎన్నికలు నిష్పాక్షికంగా, సజావుగా ముగిసేందుకు పూర్తి సహకారం అందించాలని మున్సిపల్ అధికారులు పిలుపునిచ్చారు.

**వార్డుల బరిలో పార్టీల వారీగా నామినేషన్ల వివరాలు**

రెండో రోజు దాఖలైన మొత్తం 44 వార్డు నామినేషన్లలో వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

తెలుగుదేశం పార్టీ,అత్యధికంగా 26 నామినేషన్లు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 7 నామినేషన్లు

జనసేన పార్టీ 4నామినేషన్లు

స్వతంత్ర అభ్యర్థులు 7 నామినేషన్లు (మొత్తం వార్డు నామినేషన్లు: 44

చైర్‌పర్సన్ పీఠం కోసం పోటాపోటీ

ప్రతిష్టాత్మకమైన రాజంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానానికి రెండో రోజు మొత్తం 3 నామినేషన్లు స్వీకరించబడ్డాయి:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2 నామినేషన్లు

తెలుగుదేశం పార్టీ 1 నామినేషన్ (మొత్తం చైర్‌పర్సన్ నామినేషన్లు: 3)

ఎన్నికల కోడ్ తప్పనిసరి -- అధికారుల స్పష్టీకరణ

ఎన్నికల నిబంధనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించరాదని రిటర్నింగ్ అధికారులు స్పష్టం చేశారు.

# దసరా రద్దీ: విజయవాడ హైవేపై కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్




విజయవాడ మనం ప్రతినిధి : దసరా పండుగ పురస్కరించుకుని హైదరాబాద్ నగరవాసులు భారీ సంఖ్యలో సొంతూళ్లకు పయనమవడంతో జాతీయ రహదారులపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం ఉదయం నుంచి వాహనాలు పోటెత్తాయి. ఫలితంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. పండుగ సెలవుల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచే ప్రయాణాలు ప్రారంభం కాగా, శనివారం ఉదయానికి రద్దీ మరింత తీవ్రమైంది. విజయవాడ వైపు వెళ్లే వాహనాలతో టోల్‌ప్లాజా పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. సాధారణ రోజుల్లో కొద్ది నిమిషాల్లోనే దాటాల్సిన టోల్‌గేట్‌ను దాటేందుకు గంటల సమయం పడుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు, ఇదే మార్గంలోని చౌటుప్పల్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతుండటం ట్రాఫిక్‌కు అదనపు ఆటంకంగా మారింది. నిర్మాణ పనుల కారణంగా వాహనాలన్నీ సర్వీస్ రోడ్డు మీదుగా నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో, ఇది వాహనాలు నిలిచిపోవడానికి మరో ప్రధాన కారణంగా నిలుస్తోంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు రంగంలోకి దిగి, టోల్‌ప్లాజా వద్ద రద్దీని తగ్గించేందుకు అదనపు సిబ్బందిని మోహరించారు. ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసే క్రమంలో కొన్ని వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లిస్తున్నారు. అయినప్పటికీ, వాహనాల తాకిడి అధికంగా ఉండటంతో రాకపోకలు నెమ్మదిగానే సాగుతున్నాయి. పండుగ ప్రయాణాలు పూర్తయ్యే వరకూ ఈ రద్దీ కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# పురపాలక సంఘాల ఎన్నికలకు 18 వరకు నామినేషన్ల స్వీకరణ

## జిల్లా ఎన్నికల అధికారి , జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు మనం ప్రతినిధి: జిల్లాలో చిత్తూరు నగరపాలక సంస్థ, కుప్పం, పలమనేరు, నగరి పురపాలక సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈనెల 18వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 19వ తేదీన నామినేషన్లు పరిశీలించడం జరుగుతుందని, 21వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని, అదే రోజు సాయంత్రం తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 28వ తేదీన వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, 30వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం, అదేరోజు ఫలితాలను ప్రకటించడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేసారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో భద్రతకు అదనపు భద్రతా సిబ్బందిని నియమించడం జరిగిందని కలెక్టర్ తెలియజేసారు.